ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 33.0 ၊ కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5

జోగుళాంబ గద్వాల జిల్లా వార్తలు

బుధవారం 10 సెప్టెంబరు 2025



కస్తూర్బా పాఠశాల ముందు దంపతుల ఆత్మహత్యాయత్నం

7

ఐదు తరగతులకు ఒకే టీచరు

» బస్వాపురం ప్రభుత్వ పాఠశాల దుస్థితి

భోజనం బాగుందా..?

కొల్లాపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాలను కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం బాగుంటుందా.. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలోని కూరగాయలు, బియ్యం, ఇతర వస్తువులను పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలను పాటించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. వంట గదిని ప్రతీరోజు శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను సమగ్రంగా పరిశీలించి, పూర్తి నివేదిక సమర్పించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.



కొల్లాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

హాస్టల్ గోడదూకి విద్యార్థుల పరుగులు

» తిరిగి హాస్టల్‌కు తీసుకువచ్చిన ఉపాధ్యాయులు
» ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతున్నారని ఆవేదన
» సమస్యలుంటే ఫిర్యాదుల బాక్సులో వేయాలి : కలెక్టర్ ఆదర్శ్ సురభి



చిట్యాల గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

6



తిమ్మాజీపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు



యూరియా కోసం మరికల్‌లో కిలో మీటర్ మేర బారులు తీరిన రైతులు

సాగు బాగు..

గతేడాది కంటే ఉమ్మడి జిల్లాలో 70,640 ఎకరాల్లో పెరిగిన సాగు

యూరియా జాగు

- యూరియా ఎక్కువ వినియోగించే పంటలే అధికం
- గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ఈ నెల అవసరానికి మించి విక్రయం
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కొరత అధికం
- సీజన్ గట్టెక్కాలంటే మరో 18,970 మెట్రిక్ టన్నులు అవసరం
- గద్వాల, నారాయణపేట నుంచి పక్క రాష్ట్రాలకు తరలింపు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్య యూరియా కొరత.. ఇందుకు రెండు ప్రధాన కారణాలుగా క్షేత్ర స్థాయిలో కనిపిస్తున్నాయి. సమయానుకూలంగా సరఫరా కావాల్సిన యూరియా రాకపోవడం ఒక కారణం కాగా.. గతేడాది కంటే ఉమ్మడి జిల్లాలో సాగు పెరగడం మరో కారణంగా చెప్పొచ్చు. అధిక యూరియా వినియోగం ఉండే పంటల సాగు గణనీయంగా పెరగడం వల్ల సమస్య తీవ్రత పెరిగింది. అలాగే సెప్టెంబరు వరకు అవసరమయ్యే యూరియా ఇంచుమించుగా సరఫరా అయినప్పటికీ.. యూరియా దొరకదనే ఆందోళనతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద బారులు తీరుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో కంటే సరఫరా కొంత మెరుగైనప్పటికీ.. సీజన్ ముగిసే వరకు యూరియా అవసరాలు తీరాలంటే ఉమ్మడి జిల్లా రైతాంగానికి మరో 18,970 మెట్రిక్ టన్నులు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కొరత తీవ్రంగా ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గద్వాల, నారాయణపేట జిల్లాల్లో సెప్టెంబరు వరకు అవసరమైన యూరియా కంటే అధికంగానే విక్రయాలు చేసినప్పటికీ.. అక్కడా రైతులు బారులు తీరుతూనే ఉన్నారు. ఈ రెండు జిల్లాల్లో యూరియాను కొందరు అక్రమార్కులు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. కొరతపై అప్రమత్తంగా లేక.. చెక్‌పోస్టులు ఆలస్యంగా పెట్టడంతో ఆ రెండు జిల్లాల్లోనూ సమస్య ఉంది. గద్వాల జిల్లాలో సెప్టెంబరు వరకు 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అవసరం కాగా.. ఇప్పటికే 16,996 మెట్రిక్ టన్నుల విక్రయం జరిగింది. అంటే 1,996 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా కొనుగోలు చేశారు. నారాయణపేట జిల్లాల్లో ఈ నెల వరకు 13,854 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటికే 15,720 మెట్రిక్ టన్నుల విక్రయం జరిగింది. అంటే 2166 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా కొన్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మాత్రం అవసరాని కంటే తక్కువగానే సరఫరా జరిగింది. అందుకే ఈ జిల్లాల్లో కొరత అత్యంత తీవ్రంగా ఉంది.



వెల్దండ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం చెప్పులను లైన్లో పెట్టిన రైతులు

18,970 మెట్రిక్ టన్నులు అవసరం..

వాస్తవానికి సీజన్ ప్రారంభానికి

(మిగతా 6లో..)

పాలమూరు బిడ్డవైతే..

ప్రాజెక్టులు పూర్తి చెయ్

» ప్రజలు 12 సీట్లు కాంగ్రెస్ పార్టీకి ఇస్తే.. పీఆర్‌ఎల్‌ఐని పడావు పెట్టావు
» 90 శాతం పనులు పూర్తయినా.. 10 శాతం పనుల పూర్తికి మనసు లేదా?
» డీపీఆర్, అనుమతులు లేకే కొడంగల్ ఎత్తిపోతలపై ఎన్జీటీ స్టే
» మామ పేరు పెట్టుకొని పాలమూరు నోట్లో మట్టిగొడుతున్నారు
» పీఆర్‌ఎల్‌ఐ పూర్తిచేస్తే అభినందిస్తాం.. లేకపోతే ప్రజలతో అభిశంసిస్తాం
» కేసీఆర్ నాయకత్వంలో ప్రాజెక్టు పూర్తయి 8 లక్షల ఎకరాలకు సాగునీరు
» జడ్చర్లలో విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



జడ్చర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శ్వేతాలక్ష్మారెడ్డి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు(చిత్రంలో ఎడమ నుంచి) ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదే పదే నల్లమల నుంచి వచ్చిన వాడినని, ఆకలి విలువ తెలిసిన వాడినని, రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడినని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి.. పాలమూరు బిడ్డ అయితే.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి మొదటి వర్ధంతికి మంగళవారం మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితో కలిసి హాజరైన కేటీఆర్.. జడ్చర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్, ఆయన గతంలో పనిచేసిన తెలుగుదేశం పార్టీలే పాలమూరు వెనుకబాటుతనానికి కారణమన్నారు. ఈ విషయం గతంలో రేవంతే చెప్పారని అన్నారు. తమ జిల్లా వ్యక్తి సీఎం అయితే జిల్లా ప్రయోజనం ఒనగూరుతుందని, ఫలితాలు శరవేగంగా వస్తాయని, ఆరు గ్యారంటీలు నూరు రోజుల్లోనే అమలవుతాయని, పాలమూరు బతుకు ముఖచిత్రం మారుతుందని ఎన్నో ఆశలతో 12 సీట్లు పాలమూరు ప్రజలు ఇచ్చారని అన్నారు.

పాలమూరును పడావు పెట్టారు

ఇప్పటికి 21 నెలలు పూర్తయినా కేసీఆర్ నాయకత్వంలో 90 శాతం పనులు

(మిగతా 6లో..)

జాతీయ లోక్ అదాలత్‌ను.. సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయాధికారి సునీత

వనపర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) లీగల్ కంట్రిబ్యూటర్ : వనపర్తి జిల్లా కోర్టులో ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి సునీత కోరారు. మంగళవారం వనపర్తి జిల్లా ప్రధాన న్యాయస్థానంలో న్యాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసులను అధిక మొత్తంలో రాజీపరచాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయాధికారులు రజని, కళార్చన, కవిత, జూనియర్ న్యాయాధికారులు కార్తీక్‌రెడ్డి, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సునీత

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

» లక్షలు వెచ్చించినా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
» పిచ్చి మొక్కలతో నిండిన మైదానాలు
» వాడుకలోకి తెస్తే క్రీడాకారులకు ఉపయోగకరం



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వనపర్తి పట్టణంలోని క్రీడా ప్రాంగణం

6

అర్ధాకలితో అవస్థలు

ఇంటర్ విద్యార్థుల ఆవేదన

» ప్రభుత్వ కళాశాలల్లో అమలు కాని మధ్యాహ్న భోజనం
» ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు



మల్దకల్ కళాశాల తరగతి గదిలో గ్రామీణ విద్యార్థులు

7

క్షుద్ర పూజల పేరుతో మోసంపై ఎస్పీ ఆరా

» బాధితులను విచారించిన ఎస్‌ఐ శేఖర్

7

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

గద్వాల సర్కిల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తెలుగు సాహిత్య పుస్తక ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకున్నది. పాఠశాల విద్యార్థులు పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. పలు పుస్తకాల ప్రాముఖ్యతను, తెలుగు కవుల జీవిత చరిత్రను, ప్రజాకవి కాళోజీ జీవిత ప్రస్థానం, తెలుగు సాహిత్యం, భాషపై ఆయనకున్న ప్రేమ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కవి చేసిన కృషిని పాఠశాల తెలుగు భాషా ఉపాధ్యాయుడు మహేందర్ విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వీక్షిస్తున్న విద్యార్థులు

బెల్ట్ తీస్తారా..?

» గద్వాల జిల్లాలో జోరుగా బెల్ట్‌షాపుల నిర్వహణ
» రాత్రి, పగలు మద్యం అమ్మకాలు
» క్వార్టర్‌పై అదనంగా రూ. 50 వసూలు
» గ్రామాల్లో గల్లిగల్లీకో దుకాణం
» మద్యం మత్తులో యువత

గద్వాల క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుందంటే మద్యం అమ్మకాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మద్యం అమ్మకాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కంటే జోగుళాంబ గద్వాల జిల్లా ముందు వరుసలో ఉందంటే ఇక్కడ మందు బాబులు ఎంత తాగుతున్నారో అర్థమవుతోంది. అయితే ఇక్కడ మద్యం దుకాణాల కంటే బెల్ట్ దుకాణాల్లో ఎక్కువ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. గ్రామాలు, మండలాల్లో గల్లిగల్లీకి ఒక బెల్టుషాపు నడుపుతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. బెల్టు షాపుల నిర్వహణతో తమ పిల్లల భవిష్యత్తు పాడవుతోందని, అధికారులు స్పందించి బెల్టుషాపులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

24 గంటలు అందుబాటులో మద్యం ..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరించడంతో బెల్ట్‌షాపుల్లో 24 గంటలు మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని ప్రతీ గ్రామం, మండల కేంద్రాల్లో అర్ధరాత్రి వెళ్లినా బెల్టుషాపుల్లో మద్యం లభిస్తోంది. సాధారణంగా మద్యం దుకాణాలలో ఎంఆర్‌పీ ధరకు విక్రయిస్తే.. బెల్ట్‌షాపులలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. క్వార్టర్‌పై అదనంగా రూ. 50కి పైగానే, బీరుపై రూ. 30దాకా అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా అధికారులకు తెలిసినా వారిచ్చే మడుపులకు అలవాటు పడి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

మద్యం మత్తులో యువత..

బెల్టు షాపుల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండటంతో యువత మద్యం మత్తులో తూగుతోంది. గద్వాల పట్టణంలోని జమ్మిచేడులోని బెల్ట్‌దుకాణంలో మద్యం మత్తులో గతంలో కారును అతివేగంగా నడిపి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. తాజాగా జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ సమీపంలోని ఓ బెల్ట్‌దుకాణంలో కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో మాజీ కౌన్సిలర్‌తో పాటు మునిసిపల్ ఉద్యోగిపై దాడి, దౌదర్‌పల్లిలో డీలర్ మధుపై హత్యాయత్నం చేశారు. బెల్టుషాపుల నిర్వహణను అధికారులు కట్టడి చేస్తే ఇలాంటి ఘటనలు చోటుచేసుకునేవి కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో నడుపుతున్న బెల్టు దుకాణాల యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బెల్టుషాపులో పట్టుబడ్డ మద్యం(ఫైల్)



గద్వాలలో బెల్టుషాపు వద్ద మద్యం తాగుతున్న దృశ్యం

బెల్ట్ షాపుల వల్ల ఇబ్బంది పడుతున్నాం..



బెల్ట్‌షాపుల నిర్వహణతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడంలేదు. మందు బాబులు అర్ధరాత్రి బెల్టు షాపులకు వస్తున్నారు. మహిళలు రాత్రివేళ బాత్‌రూంకు వెళ్లాలంటే బయపడుతున్నారు. మందుబాబులు బెల్టుషాపుల వద్ద మద్యం తాగి మత్తులో గొడవలకు దిగుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బెల్టు దుకాణాలను నివారించాలి.

-నర్సింహులు యాదవ్, గద్వాల

కేసులు నమోదు చేస్తాం



బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు. ఇప్పటికే జిల్లాలో పలు కేసులను నమోదు చేశాం. బెల్ట్‌షాపుల పేరుతో అర్ధరాత్రి మద్యం అమ్మకాలను జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- గణపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, గద్వాల

మూసుకున్న శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు

» 81,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

6

పాలమూరు ప్రజలకు వరం క్యాన్సర్ కేర్ సెంటర్

» జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగా అజ్మీర



క్యాన్సర్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ రంగా అజ్మీర

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ కేర్ సెంటర్ పాలమూరు ప్రజలకు వరమని సూపరింటెండెంట్ రంగా అజ్మీర అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో క్యాన్సర్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇది వరకు క్యాన్సర్ రోగుల కోసం ప్యాలియేటిక్ కేర్ సెంటర్ ఉండేదని, దాని స్థానంలో క్యాన్సర్ కేర్ సెంటర్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో ఆంకాలజిస్టు కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. చాలా మంది క్యాన్సర్ రోగులు హైదరాబాద్‌కు వెళ్లేవారని, ఈ సెంటర్ ఏర్పాటు చేయడంతో అన్ని రకాల క్యాన్సర్ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి అమరావతి, డా. బాలశ్రీనివాస్, ఆంకాలజిస్టు రాహుల్, ఆసుపత్రి ఏవో ప్రేరణ, ప్యాలియేటివ్ మెడికల్ ఆఫీసర్ దివ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

» పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్



కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల భవన నిర్మాణ పనుల త్వరితగతిన పూర్తి చేయాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీలోని లా, ఇంజనీరింగ్ కళాశాలలకు సంబంధించిన తరగతి గదులను పరిశీలించారు. పనుల నాణ్యత, వినియోగిస్తున్న సామగ్రి ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యత లోపం సహించబోమని కాంట్రాక్టర్లకు సూచించారు.

యాప్ ద్వారా పంటకోత ప్రయోగాలపై శిక్షణ



మాట్లాడుతున్న ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగాల డిజిటల్ యాప్‌పై శిక్షణా తరగతులను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్ఐసీ సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎస్ఓఏఈఓలు వారికి కేటాయించిన గ్రామాలలో పొరపాటు లేకుండా పంటకోత ప్రయోగాలు నిర్వహించాలని సూచించారు. సేకరించిన వివరాలను సమయానికి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రయోగాలు నిర్వహిస్తున్నప్పుడు ప్రాథమిక కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. మార్కెట్ ధరలు, ఎగుమతులు, దిగుమతులు స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గణాంక అధికారులు నర్సింహులు, రాజేశ్, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

» ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలి

» ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన



వనపర్తి జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

వనపర్తి విద్యావిభాగం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి రాజీవ్ చౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా రాష్ట్రంలో రూ.8,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలకు నోచుకోలేదన్నారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి కళాశాల ఫీజులు చెల్లించాల్సి వస్తుందన్నారు. తక్షణమే నిధులు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, కార్తీక్, బంటి, నితిన్, మనోహర్, కుమార్, నరసింహ, నందు, అనిల్, సంతోష్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో గోపాల్‌పేట విద్యార్థులకు చోటు

గోపాల్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల విద్యార్థులు తమ పేరును నమోదు చేసుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ విద్యార్థినుల ప్రతిభను గుర్తించింది. ఒక్కో విద్యార్థిని శ్రీవల్లి (వంద తెలుగు సామెతలు) శివాని (వంద సుభాషితాలు) అనిత (వంద ప్రముఖుల జయంతులు) శారద (వంద పదహరణలు) అతి తక్కువ సమయంలో చెప్పి ఆశ్చర్యపరిచారు. వీటిని వీడియో తీసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులకు శనివారం పంపించారు. వారి పరిశీలించి సోమవారం ప్రశంసాపత్రాలు, మెడల్స్ పంపించారు. వాటిని డీఈవో అబ్దుల్‌ఘని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో విద్యార్థులకు అందించి అభినందించారు.

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు



ఛూత్పూర్ మండలం పాతమొల్గరలో పొలాల మధ్య క్రీడా ప్రాంగణం బోర్డు

» గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిన వైనం

» వాడుకలోకి తెస్తే క్రీడాకారులకు ఉపయోగకరం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల కోసం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు, గడ్డితో దర్శనమిస్తున్నాయి. అప్పట్లో ఏర్పాటు చేసిన పలు క్రీడా పరికరాలు తుప్పు పట్టాయి. చూసిన వారికి అసలు ఇవి గ్రామీణ క్రీడా ప్రాంగణాలేనా అన్న సందేహం కలగక మానదు. ఉమ్మడి జిల్లాలో ప్రతీ పంచాయతీ, మునిసిపాలిటీలో ఆటలు ఆడుకునేందుకు వీలుగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఉమ్మడి జిల్లాలో 2,278 గ్రామాలు, ఆవాసాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి. కానీ 20 శాతానికిపైగా గ్రామాల్లో ఇప్పటికీ ఏర్పాటు కాలేదు.

క్రీడా నైపుణ్యాలు వెలికి తీయడానికి

యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి క్రీడలు ఎంతగానో తోడ్పడుతాయి. దీని కోసం రూ.లక్షలు వెచ్చించి తెలంగాణ క్రీడా ప్రాంగణాల పేరుతో 2022 జూలైలో మైదానాలను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్ జంప్ కోర్టులతో పాటు వ్యాయామ పరికరాలు సిద్ధం చేశారు. కొన్ని చోట్ల పాఠశాల మైదానాలకే బోర్డులు తగిలించారు. చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగానే ఉన్నాయి.

మునిసిపాలిటీల్లో పరిస్థితి అధ్వానం

గ్రామీణ ప్రాంత క్రీడా మైదానాలు దయనీంగా ఉంటే.. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 19 మునిసిపాలిటీలు ఉండగా, 385 వార్డుల్లో 434 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తొలి విడతలో 44 ప్రాంగణాల్ని అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. అరకొర వసతులతో, ఆడుకునేందుకు అనుకూలంగా లేని వాటిని సిద్ధం చేసి బిల్లులు మాత్రం దండుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మానవపాడు మండలం గోకులపాడు పాఠశాలలో క్రీడాప్రాంగణం బోర్డు

క్రీడా వస్తువులు అందజేత

పూర్తయిన క్రీడాప్రాంగణాల కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కిట్లను సైతం అందించారు. వీటిలో క్రికెట్, వాలీబాల్ కిట్, 75 టీ-షర్టులు, డంబెల్స్, డిస్కస్‌త్రో, టెన్నీ కాయిట్‌రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్, విజిల్స్ కొలతల టేపు లాంటివి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 70 శాతం వరకు కిట్లు పంపిణీ చేయగా, 30 శాతం పంపిణీ చేసినా ప్రాంగణాలు సరిగా లేకపోవటంతో వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలని యువత ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తుంది. గతంలో కంటే ప్రస్తుతం క్రీడలకు పెద్దపీట వేస్తుంది. దాదాపు రెండేళ్లలో రూ.840 కోట్ల క్రీడా బడ్జెట్ కేటాయించింది. క్రీడా పాలసీ రూపొందించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారించారు. క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తేస్తే గ్రామీణ క్రీడాకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

- నారాయణపేట జిల్లాలో 280 గ్రామాలుండగా అన్ని చోట్ల క్రీడా ప్రాంగణాలకు స్థలాలు గుర్తించారు. చాలా చోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఏర్పాటు చేసిన సామగ్రి కన్పించడం లేదు.
- జోగులాంబ గద్వాల జిల్లాలో 255 పంచాయతీల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు చాలా చోట్ల స్థలాలు దొరకని కారణంగా 70 శాతం మాత్రమే పూర్తి చేశారు. చాలా చోట్ల గడ్డి, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఒక్కో పంచాయతీకి సుమారు రూ.50వేల వరకు ఖర్చు చేసినా లక్ష్యం నెరవేరలేదు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 464 పంచాయతీల్లో ఏర్పాటుకు ప్రతిపాదించారు. చాలా చోట్ల వీటిని పాఠశాలల్లో ఏర్పాటు చేసి వదిలేశారు. చాలా పంచాయతీల్లో కేటాయించిన స్థలాలు చదును చేసి వదిలేశారు.
- వనపర్తి జిల్లాలో 260 పంచాయతీల్లో 70 శాతం మాత్రమే పూర్తి చేశారు. తాజాగా ఆయా మైదానాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో వెళ్లేందుకు క్రీడాకారులు ఇష్టపడటం లేదు. వాటి ఆలనా పాలనా లేక చెట్లు మొలచి ఆడుకునేందుకు ఏ మాత్రం సౌకర్యంగా లేవు.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 441 పంచాయతీల్లో 80 శాతం మైదానాలకు స్థలాలు కేటాయించారు. చాలా చోట్ల పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉన్న వాటిలో గడ్డి మొలచి లోపలికి వెళ్లేందుకు కూడా వీల్లేకుండా మారాయి. కొన్ని పంచాయతీల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో పిల్లలు వచ్చి ఆడుకుంటున్నారు. గతంలో ఇచ్చిన క్రీడా సామగ్రి తుప్పు పట్టిపోయింది. ఖోఖో, వాలీబాల్ పోల్స్ కూడా ఎత్తుకెళ్లారు.

పాలమూరు బిడ్డవైతే.. ప్రాజెక్టులు పూర్తి చెయ్

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేసుకుని వడ్డించిన విస్తరిలా ఉన్న పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడం లేదని కేటీఆర్ అన్నారు. 10 శాతం పనులు పూర్తిచేసి నీళ్లిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, ఆయన్ను ప్రజలు గుండెల్లో చిరస్థాయిగా పెట్టుకుంటారనే దురాలోచనతో కావాలనే పథకాన్ని పడావు పెట్టారని ఆరోపించారు. ఈ పరిణామాలను ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం గమనిస్తోందని అన్నారు. ఏదో ఆదరబాదరగా.. డీపీఆర్, పర్యావరణ అనుమతులు లేకుండా, తప్పుడు సలహాతో రూ.4 వేల పైచిలుకు కోట్లతో శ్రీశైలం నుంచి జూరాలకు సోర్స్ మార్చి.. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపడితే పర్యావరణ అనుమతులు లేవని ఎన్జీటీ స్టే ఇచ్చిందన్నారు. నష్టపరిహారం కోసం రైతులు కదం తొక్కుతున్నారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారానే రంగారెడ్డిలో 6 లక్షల ఎకరాలకు, సీఎం నియోజకవర్గం కొడంగల్‌లో 2 లక్షల ఎకరాలకు నీరిచ్చే అవకాశం ఉన్నా.. పేట ఎత్తిపోతల పథకాన్ని వేరే ఆలోచనతో చేపట్టారని విమర్శించారు. పాలమూరు బిడ్డగా చెప్పుకునే రేవంత్‌రెడ్డి పాలమూరును పడావు పెడుతున్నారని ఆరోపించారు.

చౌకబారు పనులు ఆపాలి

కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి జిల్లాలో 8 లక్షల ఎకరాలకు నీరిచ్చామని, కోనసీమగా మార్చేందుకు బృహత్ ప్రణాళికతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను చేపట్టి 90 శాతం పూర్తిచేస్తే 10 శాతం పనులు చేయడం కోసం నిధులు ఇచ్చేందుకు ఆయనకు మనసు రావడం లేదని కేటీఆర్ అన్నారు. పనులు చేయకుండా తన మామ జైపాల్‌రెడ్డి పేరును పెట్టుకున్నారన్నారు. ఆయన పాత్ర ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో, ఇరిగేషన్‌లో, కల్వకుర్తి అభివృద్ధిలో, తెలంగాణ పోరాటంలో ఎంత ఉందో ప్రజలకు తెలుసునని అన్నారు. జిల్లాలో ఉన్న పరిస్థితుల మీద నాయకత్వం వివరించిందని చెప్పారు. దేవరకద్రలో పార్టీ మండల అధ్యక్షుడిని లేని కేసులతో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. చిన్న వ్యాపారాలు చేసుకునే వారి క్రషర్లు మూయించడం, జీఎస్టీ అధికారులు, పోలీసుల నుంచి ఒత్తిడి తేవడం, కేసులు పెట్టడం జరుగుతోందని అన్నారు. పార్టీలో చేరితే కేసు తీసివేస్తామని, లేకపోతే జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ చౌకబారు పనులు ఆపేసి.. పాలమూరు- రంగారెడ్డిని పూర్తిచేస్తే అభినందిస్తామని, లేకపోతే ప్రజల ద్వారా అభిశంసిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, ఎస్. రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆవంచలో శ్వేతారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్

నివాళి అర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు

జడ్చర్ల, (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతాలక్ష్మారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఉన్నారు.

ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దుస్థితిలో గద్వాల ఎమ్మెల్యే

పార్టీ మారిన గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్‌లోనే ఉంటే పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకుండా.. మంత్రులు బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను తిడుతుంటే ఇకిలించి కూర్చున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని.. సిగ్గులేకుండా బీఆర్ఎస్‌లో ఉన్నానని ఎలా చెప్పుకుంటారని అన్నారు. ఆయన గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలు, ఓట్లు వేసిన ప్రజల విజ్ఞతను హేళన చేస్తున్నారని విమర్శించారు.

శ్వేతారెడ్డి విగ్రహం ఆవిష్కరణ

తిమ్మాజిపేట, (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చర్లకోల లక్ష్మారెడ్డి సతీమణి చర్ల శ్వేతారెడ్డి విగ్రహాన్ని స్వగ్రామం తిమ్మాజిపేట మండలం ఆవంచలో మంగళవారం మాజీ మంత్రులు కే.తారక రామారావు, హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, జోగు ప్రదీప్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మూసుకున్న శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు

» 81,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణ, తుంగభద్ర నదులకు వరద తగ్గిపోయింది. దీంతో మంగళవారం ప్రాజెక్టులకు కూడా ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో గేట్లను మూసివేశారు. శ్రీశైలం ప్రాజెక్టుకు మంగళవారం 81,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోని గేట్లను మూసివేసి కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,305 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 208.28 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లు మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 30 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 26 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 20 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తోంది. ప్రస్తుతం జూరాలకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 20,139 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 43 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 39 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

సాగుబాగు.. యూరియా జాగు

(5వ పేజీ తరువాయి)

ముందే ఎరువులను ఇండెంట్ పెట్టి.. సరఫరా చేసిన తర్వాత నిల్వ చేసుకోవాలి. కానీ ఈ ఏడాది ఈ విషయంలో కొంత తాత్సారం జరిగింది. కేంద్రం నుంచి రావాల్సిన యూరియా సమయానుకూలంగా సరఫరా కాలేదు. ప్రస్తుత కొరతకు అదే ప్రధాన కారణం. అలాగే రాష్ట్రంలో ఉన్న రామగుండం ఎఫ్‌సీఐ మరమ్మతులకు గురికావడంతో సమస్య తలెత్తింది. సెప్టెంబరు వరకు ఉమ్మడి జిల్లాలో 1,10,157 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. 9,55,46 మెట్రిక్ టన్నులను ఇప్పటివరకు విక్రయించారు. ఆయా జిల్లాలో కలిపి సుమారు 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా ప్రస్తుతం అందుబాటులో ఉంది. రెండు మూడు రోజుల్లో మరింత యూరియా సరఫరా కానుంది. గద్వాల, నారాయణపేట జిల్లాల్లో అధికంగా యూరియా విక్రయం కాకపోతే 14,611 మెట్రిక్ టన్నుల యూరియా సరిపోయేది.. కానీ ఆ జిల్లాల నుంచి పక్క రాష్ట్రాలకు యూరియా తరలిపోవడంతో ఈ సీజన్ గట్టెక్కాలంటే మరో 18,970 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవుతుంది. నారాయణపేట, గద్వాల జిల్లాల్లో కలిపి 4,162 మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కువ విక్రయం జరిగింది. ఎఫ్‌సీఐ పునరుద్ధరణ కూడా పూర్తికావడంతో యూరియా సరఫరా వేగంగా జరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముందస్తు చర్యలు తీసుకోకపోవడం, రైతులకు అవగాహన కల్పించకపోవడం, మళ్లీ దొరుకుతుందో లేదోననే ఆందోళనలు రైతుల్లో పెరగడంతోనే ప్రస్తుతం సమస్య ఏర్పడిందని చెప్పొచ్చు.

సాగు పెరగడం కూడా సమస్యే..

అధికారులు గత సంవత్సరం అంచనాలకు అనుగుణంగా కొంత బఫర్ స్టాక్‌తో ఎరువుల కోసం ఇండెంట్ పెడతారు. అయితే ఈ ఏడాది సాగు పెరగడం, అందులోనూ యూరియా ఎక్కువగా అవసరమయ్యే పంటల సాగు పెరగడంతోనే కొరత తీవ్రంగా మారింది. గత సంవత్సరం వానాకాలంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 17,37,025 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 18,07,665 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అంటే గతేడాది కంటే 70,640 ఎకరాల్లో పంటలు అధికంగా సాగయ్యాయి. ఎక్కువగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 34,867 ఎకరాల్లో అధికంగా సాగు కాగా.. ఆ తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో 21,570 ఎకరాలు, నారాయణపేట జిల్లాలో 10,256, గద్వాల జిల్లాలో 2479, వనపర్తి జిల్లాలో 618 ఎకరాల్లో పంటలు అధికంగా సాగయ్యాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తిసాగు గణనీయంగా పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది వరి 19,4,983 ఎకరాలు సాగు కాగా.. ఈ ఏడాది 20,7,210 ఎకరాల్లో సాగైంది. అంటే 12 వేల ఎకరాల్లో వరిసాగు పెరిగింది. మొక్కజొన్న గతేడాది 22,583 ఎకరాల్లో సాగుకాగా.. ఈ ఏడాది 36,909 ఎకరాల్లో సాగైంది. 14 వేల ఎకరాల్లో సాగు పెరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గతేడాది పత్తి 21,9,709 ఎకరాల్లో సాగు కాగా.. ఈ ఏడాది 26,7,079 ఎకరాల్లో సాగు చేశారు. 47 వేల ఎకరాల్లో పత్తిసాగు పెరిగింది. మొక్కజొన్న గతేడాది 42,565 ఎకరాల్లో సాగుకాగా.. ఈ ఏడాది 52,274 ఎకరాల్లో సాగైంది. 9,709 ఎకరాల్లో సాగు పెరిగింది. అయితే ఈ జిల్లాలో వరి 19,945 ఎకరాలు తగ్గింది. అన్ని జిల్లాల్లో యూరియా అధికంగా అవసరమయ్యే వరి, మొక్కజొన్న, పత్తి సాగు పెరగడంతో సమస్య తీవ్రమైందని తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ



క్రీడాకారుడు లక్ష్మణ్

మన్ననూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జింఖానా మైదానంలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి ఇండియన్ సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు చెందిన గిరిజన యువకుడు ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించాడు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన విస్లావత్ లక్ష్మణ్ పదర జడ్పీహెచ్ఎస్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఏటా జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ ఏడాది లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించి డిసెంబర్‌లో డెహ్రాడూన్ లో జరిగే జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ పోటీలలో ఆడేందుకు అర్హత సాధించాడు. ఆయనను పదర జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయ బృందం, మన్ననూరు గ్రామంలోని ఉమామహేశ్వర గిరిజనతండా వాసులు అభినందించారు.

అటవీ భూములను సాగు చేసుకుంటాం

» ఫారెస్ట్ రేంజ్ అధికారికి వినతి

అమ్రాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లి సమీపంలోని కండ్లకుంట అటవీ భూములను ఆదిమ జాతి చెంచులకు సాగు చేసుకునే అవకాశమివ్వాలని అమ్రాబాద్ అటవీ రేంజ్ అధికారి వీరేష్‌కు మంగళవారం చెంచు సేవా సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం ఈ భూములపై హక్కులు కల్పించాలని వారు కోరారు. చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగయ్య, హరినారాయణగౌడ్, ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

» భక్తిపారవశ్యంలో లాల్‌కోట



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట గ్రామంలో మంగళవారం రథోత్సవ కార్యక్రమం కనులపండువగా జరిగింది. గ్రామంలోని ఆంజనేయస్వామి, ఈశ్వర ఆలయంలో రెండు రోజులుగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉదయం తీర్థావళి, నది స్నానం, ఆంజనేయస్వామి ఆలయం వద్ద రథోత్సవ కార్యక్రమం శివాలయం వరకు కొనసాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీరభద్ర సేవ, అగ్నిగుండం కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పెద్ద మంగళహారతి కార్యక్రమం చేపట్టారు. గ్రామం నుంచే కాకుండా మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రథోత్సవం తిలకించారు.

హాస్టల్ గోడ దూకి విద్యార్థుల పరుగులు

» ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతున్నారని ఆరోపణ

» విద్యార్థులను తిరిగి హాస్టల్‌కు తీసుకువచ్చిన ఉపాధ్యాయులు

» సమస్యలుంటే ఫిర్యాదుల బాక్సులో వేయాలి : కలెక్టర్

వనపర్తి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతున్నారని విద్యార్థులు హాస్టల్ గోడదూకి పరుగులు తీసిన ఘటన వనపర్తి జిల్లా చిట్యాల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం చోటు చేసుకున్నది. ప్రిన్సిపాల్ గురువయ్య గౌడ్ వేధిస్తున్నారని కలెక్టర్ కార్యాలయంలో తమ బాధ చెప్పుకుంటామని మంగళవారం ఉదయం గురుకులం ప్రహరీ దూకి విద్యార్థులు వెళ్లారు. అప్రమత్తమైన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అడవిలో నుంచి కలెక్టరేట్ వెళ్తున్న విద్యార్థులను నచ్చజెప్పి పాఠశాలకు తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్ నెల రోజుల నుంచి కక్ష సాధింపుతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని పలువురు పదో తరగతి విద్యార్థులు ఆరోపించారు. వారం రోజుల కిందట పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి తమ తల్లిదండ్రులతో అసభ్య పదజాలంతో మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీసారి మెస్ చార్జి డబ్బులు తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ తమకొద్దని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

విద్యార్థుల ఆందోళనతో చిట్యాల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. చిన్నచిన్న సమస్యలు మాత్రమే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంతో పాటు విహార యాత్రలకు తీసుకెళ్లడం, తరచుగా క్రీడలు ఆడించడం వంటివి చేయాలని విద్యార్థులు కోరారు. స్పందించిన కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సులో వేయాలని సూచించారు. అనంతరం గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులపై నిబద్ధతతో వ్యవహరించాలని, మెరుగైన బోధనలతో పాటు ప్రేమ, అభిమానం చూపించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అర్ధాకలితో అవస్థలు

ఇంటర్ విద్యార్థుల ఆవేదన

- ప్రభుత్వ కళాశాలల్లో అమలు కాని మధ్యాహ్న భోజనం
- ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు

అయిజ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆకలితో అల్లాడిపోతూ చదువుకోవడం కష్టంగా ఉందని ఇంటర్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, జిల్లా కేంద్రాల్లోని జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థులు అర్ధాకలితో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా ప్రభుత్వ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరుతున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

జిల్లా కేంద్రంలో 2, అయిజ, మానవపాడు, అలంపూర్, గట్టు, ధరూరు, మల్దకల్‌లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 13 మండలాల్లో 8 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఆయా కాలేజీల్లో ప్రథమ సంవత్సరంలో 1,722, ద్వితీయ సంవత్సరంలో 1,509 మంది, మొత్తంగా 3,231 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటిక్యాల, వడ్డేపల్లి మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేవు. అలాగే కొత్త మండలాలైన ఎర్రవల్లి, రాజోళి, ఉండవల్లి, కేటీదొడ్డి మండలాల్లోనూ కాలేజీలను ఏర్పాటు చేయలేదు.

గ్రామీణ విద్యార్థుల అవస్థలు

అయిజ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గట్టు, వడ్డేపల్లి, రాజోళి, ఇటిక్యాల మండలాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారు. అలంపూర్,


అయిజ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారాన్ని తింటున్న విద్యార్థులు

గద్వాల, మల్దకల్, మానవపాడు, గట్టు, ధరూరు మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సమీప గ్రామాల నుంచి అత్యధిక మంది విద్యార్థులు వస్తున్నారు. గ్రామం నుంచి తాము చదువుకునే కళాశాలకు చేరుకోవాలంటే వారికి దాదాపు 2 గంటల సమయం పడుతుంది. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అందుకోసం ఉదయం 7 గంటలకల్లా ఇంటినుంచి బయలు దేరాల్సి ఉంటుంది. ఇంట్లోని పెద్ద వారు రైతులైతే పొలాలకు, కూలీలైతే పనులకు వెళ్లే పనిలో నిమగ్నమై ఉంటారు. ఆ సమయానికి చాలా మంది ఇళ్లల్లో భోజనం సిద్ధం కాదు. వీలైతే ఏదైనా రొట్టె, ఉప్మా లాంటిది తిని కళాశాలకు బయలుదేరాల్సి రావడంతో వారు టిఫిన్ బాక్స్ తెచ్చుకొనే అవకాశం ఉండటం లేదు. కాలేజీలో సాయంత్రం క్లాసులు అయిపోయాక విద్యార్థులు బస్టాండ్‌కు వచ్చి, బస్సుల్లో గ్రామాలకు చేరుకొనే సరికి రాత్రి 7 గంటలు అవుతోంది. అప్పటి దాకా వారు ఆకలితో నకనకలాడాల్సి వస్తోంది.

ప్రభుత్వం స్పందించాలి

ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కేజీబీవీలు, గురుకులాల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అమలవుతోంది. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినా, ఎక్కువ కాలం కొనసాగలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



హృదయరాజు, జిల్లా నోడల్ అధికారి : ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు పడుతున్న అవస్థలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రధానంగా గ్రామీణ, పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం అనుమతి వస్తే అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అమలు జరిగితే గ్రామీణ విద్యార్థుల ఆకలి తీర్చిన వారు అవుతారు.

ఇంట్లో వంట రెడీ కాదు



జ్యోత్స్న, ఇంటర్ (ద్వితీయ), వడ్డేపల్లి : కళాశాలకు బయలుదేరే సమయానికి ఇంట్లో వంట రెడీ కాదు. సమయం మించి పోతుందని, బస్సు వెళ్లిపోతుందనే ఆందోళనతో ఒక్కోసారి టిఫిన్ కూడా చేయకుండా బయలు దేరాల్సి వస్తోంది. అలాంటి సమయంలో ఆకలితో ఇబ్బంది పడుతూ పాఠాలు వినడం ఇబ్బందిగా ఉంటుంది. చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నాం.

ఒక్కోసారి అబద్ధం చెప్తాను



రామ్‌చరణ్, ఇంటర్ (ప్రథమ), ఇటిక్యాల : కాలేజీకి బయలుదేరే సమయానికి ఇంట్లో వంట కావడం కష్టం. ఉదయమే ఉన్నది తిని, కాలేజీకి వచ్చేస్తున్నాను. ఒక్కో సారి దోస్తుల క్యారియర్‌ను పంచుకొని తిన్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఒక్కో సారి వారు తినడానికి రమ్మని పిలిచినా, ఆకలిగా లేదంటూ అబద్ధం చెప్తాను. కాలేజీలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

- మరొకరికి గాయాలు


మృతి చెందిన లక్ష్మయ్య (ఫైల్)

హన్వాడ/మహమ్మదాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని నాయినోనిపల్లి గ్రామానికి చెందిన వార్ల కృష్ణయ్య (53) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సోమవారం రాత్రి కృష్ణయ్య, లక్ష్మయ్య అనే వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై మొకర్లాబాద్‌కు వెళ్లారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా మహమ్మదాబాద్ సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో కృష్ణయ్య తల పగిలింది. సంఘటనపై స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన లక్ష్మయ్య జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అడవి పందిని ఢీకొన్న బైకు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

మహమ్మదాబాద్ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అడవి పందిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, మహ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గేటు వద్ద జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కుల్కచర్లకు చెందిన హన్మంతు, కేశవులు అనే వ్యక్తులు మంగళవారం ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్‌కు బయలుదేరారు. గాధిర్యాల్ సమీపంలో రోడ్డు పక్కనున్న పొదల్లో నుంచి ఓ అడవి పంది వేగంగా వచ్చి తగలడంతో ఇద్దరూ బైకుపై నుంచి కిందపడ్డారు. దీంతో హన్మంతు ఎడమ కాలు విరిగింది. కేశవులు ముఖం, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్షుద్ర పూజల పేరుతో మోసంపై ఎస్పీ ఆరా

- బాధితులను విచారించిన ఎస్ఐ శేఖర్


బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ శేఖర్

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని బొంకూరులో క్షుద్రపూజల పేరుతో పలువురిని మోసం చేసిన ఘటనపై ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య స్పందించారు. విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శేఖర్‌ను ఆదేశించారు. ఆయన కానిస్టేబుళ్లు హుస్సేన్, నాగేశ్‌లతో కలిసి మంగళవారం గ్రామానికి వెళ్లారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించగా, చుట్టుపక్కల జనం ఏమనుకుంటారో అని మిన్నకుండినట్లు తెలిపారు. అనంతరం నగదు, బంగారం, వెండి పోగొట్టుకున్న బాధితుడు డ్రైవర్ రఘు, వారి తల్లి దండ్రులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని చెప్పారు. రాత్రి వేళ పికెట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

14 డీజే వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న డీజే వాహనాలు

మక్తల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా వినియోగించిన 14 డీజే వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే వాహనాలను వినియోగించడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండపాల నిర్వాహకుల, డీజే యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో జరిగింది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణంలోని నేతాజీ నగర్‌కు చెందిన పోతు నరేశ్‌కుమార్ కుమార్ అలియాస్ నాని (42) కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పరమేశ్వర స్వామి చెరువులో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు పరిశీలించారు. నాని కుటుంబ సభ్యులను పిలిపించగా, వారు గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు వారు భావించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదు తరగతులకు ఒకే టీచరు

- బస్వాపురం ప్రభుత్వ పాఠశాల దుస్థితి


ఐదు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు జ్యోతి

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆ పాఠశాలలో 5 తరగతులున్నాయి. 45 మంది విద్యార్థులున్నారు. కానీ ఒకే ఒక్క ఉపాధ్యాయురాలు ఉండటంతో బోధన సక్రమంగా సాగడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని బస్వాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. ఈ పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండేవారు. ఇటీవల ఉపాధ్యాయిని అరుణకుమారి పదోన్నతిపై గట్టు మండలం, మాచర్ల ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లింది. దీంతో ఉన్న ఒక్క ఉపాధ్యాయురాలు జ్యోతి 5 తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలకు మరో ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బుక్ కీపర్ చేతివాటం

- పొదుపు సంఘం నిధుల్లో గోల్‌మాల్
- రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు పక్కదారి

జడ్చర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని లింగంపేటలో మహలక్ష్మీ పొదుపు సంఘం నిధుల్లో గోల్‌మాల్ జరిగింది. అందుకు సంబంధించి విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు.. సంఘం సభ్యుల నుంచి వసూలు చేసిన డబ్బును బ్యాంకులో జమ చేయాల్సి ఉండగా, బుక్‌కీపర్ చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. జడ్చర్ల మండలంలోని గంగాపురం గ్రామీణ బ్యాంకుకు నూతనంగా వచ్చిన మేనేజర్ పొదుపు సంఘం లెక్కలను పరిశీలించడంతో అవకతవకలు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. లింగంపేట గ్రామంలోని మహలక్ష్మీ పొదుపు సంఘంలో షహనాజ్‌బేగం 28 గ్రూపులకు బుక్‌కీపర్‌గా పని చేస్తోంది. గ్రూపు సభ్యుల నుంచి వసూలు చేసిన దాదాపు రూ. 15 నుంచి రూ. 20లక్షల వరకు పక్కదారి పట్టించినట్లు సమాచారం. ఈ విషయంపై విచారణ చేపట్టేందుకు బ్యాంకు మేనేజర్ లింగంపేటకు వస్తున్నట్లు తెలుసుకున్న సభ్యులు మంగళవారం ఆమెను నిలదీశారు.

కస్తూర్బా పాఠశాల ముందు

దంపతుల ఆత్మహత్యాయత్నం


దంపతుల నుంచి పురుగు మందు డబ్బాలను లాక్కుంటున్న పాఠశాల సిబ్బంది

పెంట్లవెల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంగ్లిష్ బోధించే టీచర్ రంగినేని కళ్యాణి చిట్టి డబ్బులు రూ. 6,65,000 ఇవ్వాలని నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాల ముందు చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య, మంగమ్మ, వారి కుమారుడు విష్ణు మంగళవారం క్రిమిసంహారక మందు తాగేందుకు యత్నించారు. అదే సమయంలో అక్కడ ఉన్న పాఠశాల సిబ్బంది గమనించి వారి చేతిలో ఉన్న పురుగుల మందు డబ్బాను లాగేశారు.

అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారిని ఇంటికి పంపించేశారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపారు.

బజాజ్ ఆటో

షోరూంలో చోరీ

- రూ. 2.50 లక్షలు మాయం
- నాగర్‌కర్నూల్ పట్టణంలో ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బజాజ్ ఆటో షోరూంలో చోరీ జరిగిందని ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండ చౌరస్తా సమీపంలో బజాజ్ ఆటో షోరూం ఉంది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు షోరూం తాళాలను విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. షోరూంలోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. రూ. 2.50 లక్షలను ఎత్తుకెళ్లి పోయారు. మంగళవారం ఉదయం షోరూంకు వచ్చిన మేనేజర్ నరేశ్ చోరీ జరిగినట్లు గుర్తించాడు. సాయంత్రం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఐలమ్మ

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి


ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఐద్వా నాయకులు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సాయుధ పోరాటంలో రైతులు, దళితులు, మహిళలకు అండగా నిలబడి పోరాడిన చాకలి ఐలమ్మ చరిత్రలో చెరగని ముద్ర వేశారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ నగర్‌లో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, నాయకులు కవిత, ఉమ, శాంతమ్మ, యాదమ్మ, రక్షిత, రాణి, కాంతమ్మ, అలివేల, నందిమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

పొలం పని వదిలి పడిగాపులు

- యూరియా కోసం తప్పని అగచాట్లు
- పీఏసీఎస్‌ల వద్ద రైతుల ఎదురుచూపులు
- తెల్లవారుజాము నుంచే బారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు


ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు యూరియా కోసం వేచి ఉన్న రైతులు

నారాయణపేట/ మరికల్/ కొత్తపల్లి/ తిమ్మాజిపేట/ ఊర్కొండ/ వెల్దండ/ కోయిలకొండ/ ఖిల్లాఘణపురం/ ఆత్మకూరు/ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొలం పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉండాల్సిన రైతులు యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద పొద్దస్తమానం పడిగాపులు కాస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది.

- నారాయణపేట సింగిల్ విండో కార్యాలయం వద్ద పోలీసు పహారా మధ్య రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఒకటే బస్తా ఇవ్వడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

- మరికల్ మండలంలోని రైతు వేదిక వద్దకు సోమవారం అర్ధరాత్రే అధిక సంఖ్యలో రైతులు చేరుకున్నారు. కిలోమీటరు పొడవున క్యూలైన్లో వేచి ఉండి, రాత్రంతా జాగారం చేశారు. మంగళవారం 900 బస్తాల యూరియా రావడంతో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు బుధవారం ఇస్తామని చెప్పి, వేలిపై ఇంకు మార్కు వేసి టోకెన్లు ఇచ్చారు.

- కొత్తపల్లి మండల కేంద్రంలోని హాకా రైతు సేవ కేంద్రం వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు పడిగాపులు కాశారు. వ్యవసాయ శాఖ అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. మిగిలిన వారు నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోయారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల కేంద్రంలోని అగ్రో రైతు సేవా కేంద్రాన్ని ఉదయం 10 గంటలైనా తెరవకపోవడంతో ఆగ్రహించారు. షాపు ముందున్న రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వారికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఏఈవో సాయిరాం, ఆగ్రో రైతు సేవా కేంద్రం యజమాని లక్ష్మారెడ్డి మాట్లాడి, రైతులను సముదాయించారు. వారిని వరుస క్రమంలో నిలబెట్టి టోకెన్లు ఇచ్చారు. అనంతరం యూరియా పంపిణీ చేయించారు.

- ఊర్కొండ మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం వద్ద పోలీసుల పహారాలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

- వెల్దండ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ముందు రైతులు వరుసలో చెప్పులను ఉంచి వేచి ఉన్నారు. 280 యూరియా బస్తాలు మాత్రమే రావడంతో ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

- మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండల కేంద్రంలో శనివారం 800 మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. ఆదివారం సెలవు, సోమవారం యూరియా రాలేదు. దీంతో టోకెన్లు తీసుకున్న రైతులందరూ మంగళవారం మండల కేంద్రంలోని రాయల్ ఫర్టిలైజర్ షాపు వద్దకు చేరుకున్నారు. అందుబాటులో 270 బస్తాల యూరియా మాత్రమే ఉండటంతో ఎలా సర్దుబాటు చేయాలో తెలియక మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయాధికారులు, దుకాణం యజమాని తర్జనభర్జన పడ్డారు. చివరకు బుధవారం మరో లోడ్ వస్తుందని, అప్పుడే అందరికీ ఇస్తామని చెప్పడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

- వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం రైతుల వేదిక వద్ద యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే నిరీక్షించారు. ప్రైవేట్ డీలరు వద్ద 300, సింగిల్ విండో కార్యాలయం వద్ద 450 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు.

- ఆత్మకూరులోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఒక్కో రైతుకు ఒకటి, రెండు బస్తాలే ఇవ్వడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారికి నచ్చచెప్పారు.

పంట పాడై పోతోంది



సకాలంలో యూరియా వేయకపోవడంతో పంట పాడై పోతోందని ఖిల్లాఘణపురం మండల కేంద్రానికి చెందిన రైతు శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా పంపిణీ చేస్తున్న రైతు వేదిక వద్దకు దెబ్బతిన్న వరి దంతులను తీసుకొచ్చి అధికారులకు చూపించాడు. యూరియా ఇస్తే పంటను కాపాడుకుంటానని వేడుకున్నాడు.



క్యూలైన్లో అమ్మ.. తాత ఒడిలో చిన్నారి

మరికల్ : నారాయణపేట జిల్లా, మరికల్ మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు ముష్టి రామచంద్రి, కోడలు శ్రీలతతో కలిసి యూరియా కోసం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు వచ్చారు. శ్రీలత క్యూలైన్లో నిలుచుండగా, తాత రామచంద్రి సమీపంలోని చెట్టుకింద మనుమడిని ఆడిస్తూ కనిపించాడు.

ఎంజీఎల్ఐ గెస్ట్‌హౌస్‌లో చోరీ


గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ సతీశ్, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని జొన్నలబొగుడ శివారులో ఎంజీఎల్ఐ ప్రాజెక్టు కట్టపైనున్న గెస్ట్ హౌస్‌లో చోరీ జరిగింది. విలువైన సామాగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. సంఘటనపై గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గెస్ట్‌హౌస్‌ను ఎస్ఐ సతీశ్, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మండల పరిషత్ అధికారి నాగేంద్రం పరిశీలించారు. గెస్ట్ హౌస్ తలుపులను ఎత్తుకెళ్లారు. కిటికీల అద్దాల పగులగొట్టారు. విద్యుత్ తీగలను తీసుకెళ్లారు. సంఘటనపై విచారణ చేపట్టి దుండగులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. .

సమయానికి బస్సులు నడిపించాలి

- కానుకుర్తిలో విద్యార్థుల రాస్తారోకో

దామరగిద్ద, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రం నుంచి యానగుందికి పాఠశాల సమయానికి బస్సు సర్వీసు నడిపించాలని డిమాండ్ చేస్తూ కానుకుర్తి గ్రామానికి చెందిన విద్యార్థులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. బుధవారం నుంచి సమయానికి బస్సు సర్వీసులు నడిపిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇంటర్వ్యూ..

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ ఆయేషాబేగం, పీహెచ్‌సీ వైద్యురాలు



ధరూరు,సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆయేషాబేగం అన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించాం. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నాము.

పీహెచ్‌సీలో మందుల కొరత ఉందా?

ధరూర్ పీహెచ్‌సీలో ప్రస్తుతం మందుల కొరతలేదు. మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయి.

సబ్‌సెంటర్ల పనితీరు ఎలా ఉంది?

మండలంలో తొమ్మిది సబ్ సెంటర్లు ఉన్నాయి. సిబ్బంది కొరత సమస్య లేదు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నాము. క్యాంపులు నిర్వహిస్తున్నాం.

రక్తనమూనా పరీక్షలు చేస్తున్నారా?

ధరూర్ పీహెచ్‌సీలో మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, బ్లడ్‌గ్రూపు, హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్ తదితర వాటికి పూర్తిస్థాయిలో రక్తనమూనా కిట్లు అందుబాటులో ఉన్నాయి. రక్త పరీక్షలు చేస్తున్నాము.

న్యూస్ బాక్స్

పీఏసీఎస్ కేంద్రాల్లో యూరియా

● డీఏవో సక్రియా నాయక్



యూరియా పంపిణీ చేస్తున్న సక్రియా నాయక్

అలంపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా పీఏసీఎస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ తెలిపారు. క్యాతూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని మంగళవారం వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ మాట్లాడుతూ రైతులకు ప్రస్తుతం సహకార కేంద్రంలో 450బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో హుస్సేన్, విస్తరణ అధికారులు సాయిరాం, మానస, నీలిమ, రైతులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

రాజోలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగార్లపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల సంరక్షణ విభాగం ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంపీవో ఖాజా, పంచాయతీ కార్యదర్శి ఖలీల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, ఫీల్డ్‌అసిస్టెంట్ జమ్మన్న, ఏజీపీ చైర్మన్ మరియమ్మ, బాలల సంఘం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుద్దీపాలకు మరమ్మతులు

అయిజ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపాలిటీ పరిధిలో అధికారులు మరమ్మతులు చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ సైదులు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. పలువిద్యుత్ స్థంభాలకు మరమ్మతులు చేశారు. వెలగని విద్యుత్ బల్బులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు.

ఆడపిల్లలను గౌరవించాలి

● సీడీపీవో అధికారి ఆస్మా

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమతో చదువుకునే ప్రతీ ఆడపిల్లను గౌరవించాలని ఉండవల్లి సీడీపీవో సూపర్‌వైజర్ ఆస్మా అన్నారు. మంగళవారం ఆమె బాలల పరిరక్షణ సమితి లీగల్ అధికారి శివ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఉండవల్లి మండలం, బైరపురం గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలు, ఆకతాయిలు ఇచ్చే గిఫ్ట్‌లకు, చాక్లెట్లకు, వారు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని సూచించారు. ఎవరైనా మీపై అకారణంగా ప్రేమ చూపితే అనుమానించాల్సిందేనని, వేధింపులకు గురైతే వెంటనే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలపాలని తెలిపారు. బాలురు కూడా ఆడపిల్లల పట్ల వినయవిధేయతతో మెలగాలని చెప్పారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ సమితి కార్యకర్త అమరవాయి మద్దిలేటి, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు జయశ్రీ, విమలమ్మ, జావీద్, మల్లయ్య, చిట్టెమ్మ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టే బుల్ అనిల్‌కుమార్, సెక్రటరీ దస్తగిరి ఉన్నారు.

గ్రామాల్లో జోరుగా మట్టిదందా



ర్యాలంపాడు రిజర్వాయర్ పరిసరాల్లో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు



ధరూర్‌లో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

● 99 గ్రావిటీ కెనాల్ మీదుగా కొనసాగుతున్న రవాణా

● ట్రాక్టర్లతో తరలిస్తున్నా పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు

ధరూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలుగ్రామాల్లో జోరుగా అక్రమ మట్టి రవాణా కొనసాగుతోంది. అక్రమ మట్టి రవాణాకు ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా పగటి పూటనే దర్జాగా కొందరు అక్రమార్కులు జేసీబీలతో మట్టిని రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలావుండగా సంబంధిత అధికారులకు సైతం ఎలాంటి సమాచారం లేకుండా అక్రమార్కులు మట్టిని తరలిస్తూ ఆదాయానికి గండి కొడుతున్నారు. మండల పరిధిలోని జాంపల్లి గ్రామ సమీపంలో 99 గ్రావిటీ కెనాల్ వద్ద మట్టి తవ్వకాలను కొనసాగిస్తూ వస్తున్నారు. అలా మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్ మట్టిని రూ.1000 నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తున్నారు. గ్రావిటీ కెనాల్ మట్టిపై గద్వాల నియోజకవర్గ నేతలు సైతం టిప్పర్ల ద్వారా మట్టిని తవ్వించి రూ.లక్షల్లో దండుకున్నారు. పోలీసులకు సమాచారం తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు మండల ప్రజలు చెబుతున్నారు. వారం క్రితం గ్రావిటీ కెనాల్ వద్ద సుమారు 50 ట్రాక్టర్ల ద్వారా పగటి పూటనే మట్టి తరలించినా కానీ ఏ అధికారి కూడా ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసిన సంఘటనలు చోటుచేసుకోలేదు. అలాగే ర్యాలంపాడు రిజర్వాయర్ పరిసరాల్లో, గుడ్డెందొడ్డి, మన్నాపురం, పార్చర్ల, మార్లవీడు తదితర ప్రాంతాల నుంచి కూడా ఎక్కువ మొత్తంలో మట్టి తరలింపు జరుగుతున్నాయి. ఇలా అనేకసార్లు మట్టి తరలింపుపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా కానీ పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి, చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతి లేకుంటే చర్యలు తప్పవు

అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటాం. పగటి పూట మట్టి తవ్వకాలు జరుపుతున్న మాట వాస్తవమే, ఈ విషయం తమ దృష్టికి కూడా వచ్చింది. కిందిస్థాయి అధికారుల ద్వారా మట్టి తవ్వకాలను నిలిపివేశాము. ఇక నుంచి ఎవరైనా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే వారిపై కేసులు నమోదు చేస్తాం.

- నరేందర్, తహసీల్దార్



ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు



జిల్లా పోలీసు కార్యాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

కలాన్ని ఆయుధంగా మార్చుకున్న కాళోజీ

● కలెక్టర్ బీఎం సంతోష్

● కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళి అర్పించిన కలెక్టర్, ఎస్పీ

● జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులు

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలాన్ని ఆయుధంగా మార్చుకొని, తన కవిత్వం, రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి, పద్మవిభూషణ్ స్వర్గీయ కాళోజీ నారాయణరావు 111వ జయంతి సందర్భంగా కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఏవో భూపాల్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ అధికారి అక్బర్‌పాషా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

● ఉద్యమ చైతన్యం నింపిన కాళోజీ : ఎస్పీ

తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కాళోజీ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏవో సతీష్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ వెంకటేష్, ఐటీ సెల్ ఎస్ఐ షకూర్, డీసీఆర్‌బీబీ ఎస్ఐ స్వాతి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

● గద్వాల సర్కిల్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కలం నుంచి జాలువారిన నిఖార్సయిన కవితలతో తెలంగాణ ప్రజలను ప్రభావితం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రత్యక్షంగా.. పరోక్షంగా కృషి చేశారని పలువురు వక్తలు ఆయన సేవలను స్మరించుకున్నారు. గద్వాలలోని పలుప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలో కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తెలుగు పద్యాలు, గద్య కవితల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు హెచ్ఎం సురేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రాజోలి : రాజోలి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామ్మోహన్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ మద్దిలేటి, చంద్రకాంత్, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, లేపాక్షి ప్రొప్రైటర్ బెక్కెం భాస్కర్‌రెడ్డి

● ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానంలో లేపాక్షి భాస్కర్‌రెడ్డి

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి భావితరానికి ఉపాధ్యాయులే పునాదులని లేపాక్షి భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాస్థాయిలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులుగా ఎంపికైన లక్ష్మీదేవి (జడ్పీహెచ్ఎస్ శాంతినగర్), అన్నపూర్ణ (పీఎస్ లింగనవాయి), పరిమళ (పదోన్నతి)లను లేపాక్షి హోటల్ గార్డెన్‌లో అలంపూరు నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నేటితరం విద్యార్థులను సరైన మార్గంలో పెట్టడమే కత్తిమీద సాములా మారిందని, ఈనేపథ్యంలో సరైన మార్గంలో పెట్టడమే కాకుండా ఉత్తీర్ణత శాతాన్ని పెంచినందుకు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం నిజంగా శుభపరిణామం అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రియాజ్, శ్రీనువాస్, సూర్యబాబు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

● జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసూనరాణి



ఆసుపత్రిలోని రిజిస్టర్లను పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి ప్రసూనరాణి

మానవపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసూనరాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో ఆమె ఆసుపత్రి పరిసరాలు, ఉద్యోగుల హాజరుపట్టిక, ఓపీ పట్టిక, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామాల్లోని గర్భిణులకు ప్రతి నెలసరి వైద్యపరీక్షలు చేయించేందుకు ఆశావర్కలు కృషి చేయాలని నెలలు నిండిన గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసవం చేయించుకునేలా చూడాలని ఇందుకు సూచనలు ఇవ్వాలని చెప్పారు. తనిఖీలో డాక్టర్ హేమమానస, సిబ్బంది హెలెన్, అక్కమ్మ, చంద్రన్న, తిరుమలరావు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి

● చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ



కొత్తపల్లికి చెందిన చేనేత కార్మికులకు జియో ట్యాగ్‌లను అందజేస్తున్న మేడం రామకృష్ణ

గట్టు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో కొన్ని ఏళ్లుగా చేనేత వృత్తిపై జీవనాధారం సాగిస్తున్న చేనేత కార్మికులను రామకృష్ణ కలిశారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన నూతన జియో ట్యాగ్ నెంబర్లను అందించారు. దీంతో వీటి కోసం కృషి చేసిన జిల్లా సహాయ సంచాలకులు వీ.గోవిందయ్యకు, మేడం రామకృష్ణకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు వీరన్న, కార్మికులు కే.వీరేశ్, మోహన్, మౌలాలి, బుద్దన్న, రామాంజనేయులు, కురువ వీరేశ్, రామాంజనేయులు, కుర్వ వీరేశ్, రామాంజికుమార్, హనుమేశ్, కురవ శ్రీరాములు పాల్గొన్నారు.

దేశ సేవలో యువత ముందుండాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

అయిజ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో యువత ముందుండాలని బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం అయిజలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా పక్షం-2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుంచి వచ్చేనెల అక్టోబరు 2వ తేదీ వరకు అన్ని మునిసిపాలిటీలు, మండలాలల్లో రక్తదాన శిబిరాలు, చిత్రలేఖనం, మొక్కలు నాటడం, మేధావులతో సమావేశాలు, ఖాదీ స్టాల్ ఏర్పాటు, దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మాదన్న, వెంకటేశ్, లక్ష్మణాచారి, ప్రదీప్‌కుమార్, లక్ష్మణ్‌గౌడు, మనురెడ్డి, బ్రహ్మయ్యచారి ఉన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

అయిజ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అయిజలో తెలుగుబాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మంగళవారం తెలుగుబాషా దినోత్సవం కావటంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు బోధించే ఉపాధ్యాయులను సత్కరించారు. పట్టణంలోని అక్షర పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్ర ఆధ్వర్యంలో తెలుగు ప్రాముఖ్యతను తెలియజేస్తూ పాఠశాల ఆవరణలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఆయా పాఠశాలల విద్యార్థులు, యజమాన్యాలు తిలకించాయి.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

● గ్రామ పాలనాధికారులను ఆదేశించిన కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గ్రామపాలనాధికారుల కౌన్సెలింగ్ ప్రక్రియను అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. గద్వాల నియోజకవర్గానికి 22 మంది, అలంపూర్ నియోజకవర్గానికి 57మంది గ్రామపాలన అధికారులను మొత్తం 79 మందిని నియమించినట్లు తెలిపారు. నియామక పత్రాలు తీసుకున్న వారు వెంటనే జాయిన్ కావాలని ఆదేశించారు. గ్రామపాలన అధికారి విధులతో పాటు జూనియర్ అసిస్టెంట్ విధులు కూడా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఏవో భూపాల్‌రెడ్డి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- అయిజ ఇన్‌చార్జి హెచ్ఎం సస్పెన్షన్



తుపతురాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

అయిజ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్ళు నిర్మించగలిగే సలహాలు ఇచ్చి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అయిజ మునిసిపాలిటీ పరిధిలోని తుపతురాల గ్రామాన్ని కమిషనర్ సైదులుతో కలిసి సందర్శించారు. అక్కడ ఇందిరమ్మ పథకం కింద జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించటం జరిగింది. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. 6వ వార్డులో 12 ఇళ్లు మంజూరు కాగా 5 రూఫ్‌లెవెల్, 7 బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణంలో ఉన్నాయి. నిర్మాణానికి అవసరమైన మట్టి, ఇసుక ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ అశోక్ రెడ్డి, ఏఈ వంశీ, వార్డుఅధికారి భరత్ ఉన్నారు.

● ఇన్‌చార్జి హెచ్ఎం సస్పెండ్

అయిజ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇన్‌చార్జి హెచ్ఎంగా ఉన్న శేషఫణిశర్మను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సంతోష్ ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనకు ముందు పట్టణంలోని పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులు లేకపోవటాన్ని గమనించి, ఇన్‌చార్జి హెచ్ఎం శేషఫణిశర్మను ప్రశ్నించారు. స్థానికంగా మాలపున్నమి కావటంతో విద్యార్థులు ఇంటికి వెళ్లారని సమాధానమిచ్చారు. ఇది అధికారికంగా ప్రభుత్వ సెలవు కాదు కదా అన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు.

పోలీసు స్టేషన్లలో ఆకస్మిక తనిఖీ



గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పట్టణ, సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పరిసరాలను, ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్‌రైటర్, టెక్‌టీమ్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో రోజువారిగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, బీట్ డ్యూటీబుక్స్ తదితర రికార్డులను తనిఖీ చేశారు. గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి వివరాలను, మ్యాప్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఎంతమంది సిబ్బంది ఉన్నారు. వారు ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుంచి నిత్యం ఎన్ని బ్లూకోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బీట్స్ నడుస్తున్నాయని తెలుసుకొన్నారు. ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన కాలనీలలో పూర్తిసమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలన్నారు. అనంతరం రూరల్ పోలీస్ ఆవరణలో ఉన్న సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసారు. స్టేషన్‌లో 5ఎస్ అమలు చేయాలని, అన్ని రికార్డులు క్రమపద్ధతిలో ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య, గద్వాల సీఐ టి. శ్రీను, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవి, పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ ఉన్నారు.

● యూరియా సరఫరా కేంద్రం పరిశీలన

యూరియా సరఫరా కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన యూరియా సరఫరా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పంపిణీ చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, గద్వాల సీఐ టి. శ్రీను, గద్వాల పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ జరిగిన తర్వాత ఇంకా అక్కడ కొనసాగుతున్న పనులను మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు. ఇప్పటికే తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇతర మౌలిక వసతుల పనులను ఆయన పరిశీలించారు. వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్లు పొందిన ప్రతీ లబ్ధిదారులు ఇక్కడ నివశించే విధంగా ఏర్పాట్లు చేయాలని, అప్పుడే అందరూ వస్తారని అధికారులకు సూచించారు. మరోసారి తాను వచ్చేలోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులు కూడా సాధ్యమైనంత త్వరగా తమ మకాంను మార్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు పూడూరు క్రిష్ణ, నాయకులు కురుమన్న, వంట భాస్కర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

దాడికి పాల్పడిన 11మంది సీసీ యూత్ అరెస్ట్

● రిమాండ్‌కు తరలింపు

గద్వాల క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్ మహేశ్, మున్సిపల్ ఉద్యోగి శ్రీనివాసులుతో పాటు మరికొందరిపై దాడి చేసిన కేసులో 11మంది సీసీ యూత్ నాయకులను మంగళవారం అరెస్ట్ చేయడంతో పాటు వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మొగులయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ మహేశ్, ఆయన తండ్రి మునిసిపల్ ఉద్యోగి శ్రీనివాసులుతో పాటు అడ్డువచ్చిన మరికొందరిపై గద్వాలలో సీసీయూత్‌గా ఉన్న 11 మంది యువకులు బెల్ట్‌దుకాణంలో మద్యం తాగి దాడిచేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, 11మంది సీసీయూత్ నాయకులను అరెస్ట్ చేసి, అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

విజృంభిస్తున్న ముద్ద చర్మవ్యాధి

● మృత్యువాత పడుతున్న మూగజీవాలు

● మందు లేదంటున్న వైద్యులు

వడ్డేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతుచిక్కని రోగాలతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. గత నాలుగైదు సంవత్సరాల నుంచి ముద్ద చర్మ వ్యాధితో తెల్లజాతి పశువులు మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 6,40,000ల మూగజీవాలు ఉన్నాయి. కాగా, మండలంలో 60వేల గేదెలు, 48వేల ఆవులు, దూడలు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఆవులు, దూడలకు ముద్దచర్మ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. మండలంలోని పైపాడు, వడ్డేపల్లి, శాంతినగర్, బుడమరుసు గ్రామాల్లో ఈ వ్యాధి లక్షణాలు పశువుల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. లక్షల విలువ చేసే ఆవుదూడలు చనిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. నెలరోజుల వ్యవధిలోనే సుమారు పది మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. కాగా, రైతుకు చెందిన దూడ వ్యాధిబారిన పడి సోమవారం చనిపోయింది. పశువుల్లో ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మందులు సరఫరా చేసే విధంగా చర్యలు తీసు కోవాలని రైతులు కోరుతున్నారు.